క్లుప్తంగా

లోడు వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనాన్ని తొలగిస్తున్న క్రేన్

సామర్లకోట: కాకినాడ రోడ్డులో వీకే రాయపురం–మాధవపట్నం మధ్య లోడు వాహనం శుక్రవారం ఉదయం అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో ఉదయం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసుల వివరాల మేరకు, విజయవాడ నుంచి కాకినాడ డి–మార్టుకు సరకులు తీసుకెళుతున్న వాహనం కాకినాడ రోడ్డులో రైల్వే వంతెన దాటిన తరువాత అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు అంతగా లేకపోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో వాహనం డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. రెండు క్రేన్ల సాయంతో బోల్తా పడిన వాహనాన్ని తొలగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీలో చెత్త సమస్య



సామర్లకోట జగనన్న కాలనీ వద్ద అధ్వానంగా ఉన్న చెత్త

సామర్లకోట: జి.రాగంపేట రోడ్డులోని జగనన్న కాలనీ వద్ద చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది. జగనన్న కాలనీకి వెళ్లే కూడలిలో చిన్నారుల పార్కు వద్ద చెత్త పెరిగిపోవడంతో అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా జగనన్న కాలనీలో పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో చెత్త పేరుకుపోయిందని వాపోతున్నారు. దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆటో ఢీకొని సైక్లిస్ట్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

సామర్లకోట: కిర్లంపూడి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం, ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీ నుంచి వస్తున్న సైక్లిస్ట్ లంకా పవన్‌కుమార్‌ను ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్‌ను స్థానికులు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జగనన్న కాలనీ వద్ద ఐఎంఎఫ్ఎల్ డిపోకు చెందిన మద్యం వాహనాలు వరుసగా పెట్టడం వలన, జగనన్న కాలనీకి రాకపోకలు చేసేవారికి దారి కానరాక, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ పాలిక కుసుమ ఆరోపించారు. వాహనాలను మద్యం డిపో వద్ద పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



మామిడి రైతులకు సూచనలిస్తున్న సుజాత

పెద్దాపురం: ప్రస్తుత వేసవి దృష్ట్యా మామిడి తోటల పెంపకంపై రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం ఆమె మామిడి తోటల క్షేత్ర ప్రదర్శన చేసి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్ఏ మాదబోయిన చిలకమ్మ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఎండల తీవ్రత అధికం కానున్న నేపథ్యంలో మామిడి తోటలకు తేలికపాటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టేదశలో రెండో దఫా ఎరువులను సిఫార్సు చేసిన మేరకు వేయాలన్నారు. అధికంగా పిందె, పూత రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 4.06 మి.గ్రా. 10 లీటర్ల నీటిలోని కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

కొత్తపల్లి: ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షల్లో స్థానిక వీవీఎస్ కళాశాలలో శుక్రవారం ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. సెకండియర్ వృక్ష శాస్త్ర, గణితం, పౌర శాస్త్ర పరీక్షలు జరిగాయని చెప్పారు. మొత్తం 200 మంది విద్యార్థులకు 197 మంది హాజరైనట్టు తెలిపారు.

ఎండుతున్న పొలాలు.. రైతు కంట కన్నీరు

- గగ్గోలు పెడుతున్న భోగాపురం రైతులు
- ఏలేరు ఆయకట్టులో 300 ఎకరాలకు సాగునీటి ఎద్దడి
- బీటలు వారిన పొలాలతో రైతుల ఆందోళన



సాగు నీరివ్వండి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

పిఠాపురం: ఆరుగాలం కష్టించి పండించిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలోరని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పొట్ట దశలో ఉన్న పొలాలకు సాగు నీరు అందక పంట పొలాలు బీటలు వారి పూర్తిగా ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, తమను కాపాడాలని రైతులు చేతులు జోడించి అధికారులను వేడుకుంటున్నారు. అపర భగీరథులమని చెప్పుకునే కూటమి నేతల నియోజకవర్గంలో కళ్ల ముందే పంటలు కానరాకుండా పోయే దుస్థితి నెలకొంది. ఏలేరు పరివాహక ఆయకట్టు పరిధిలోని పిఠాపురం మండలం భోగాపురం, రాపర్తి, పి రాయవరం తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల పంట పొలాలకు నీరు అందడం లేదు. దీంతో గత వారం రోజులుగా పచ్చని పంట పొలాలు నెర్రలుబాచి ఎండి పోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామని, ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో నీటి ఎద్దడి పంటలను నాశనం చేస్తోందని రైతులు వాపోతున్నారు. సకాలంలో నీరు అందకపోతే పంటలు పూర్తిగా ఎండిపోతాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం ఇక మాకు ఇబ్బందులు ఉండవనుకుంటే ఇక్కడే ఎక్కువ ఇబ్బందులు పెడుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. వెంటనే సాగునీరు విడుదల చేసి తమను ఆదుకోవాలని లేకపోతే నష్టాల బారిన పడి చేసిన అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఎదురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పొలం అనుకుంటే పొరబాటే..

- పీబీసీ కాలువలో పెరిగిపోతున్న నాచు
- పొలంలోకి చేరి వేగంగా విస్తరింపు



పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో పెరిగిపోతున్న నాచు

సామర్లకోట: పట్టణంలోని ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి రజకపేటలోని కావమ్మ ఆలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవున పీబీసీ కాలువ పంట పొలంగా మారిపోయింది. పీబీసీ కాలువలో భక్తులు స్నానాలు చేసే రేవుల మెట్లు కూడా కనిపించని విధంగా ఆకు విస్తరించింది. సాధారణంగా కాలువలో గుర్రపుడెక్క, తూటికాడ పెరుగుతూ ఉంటాయి. విచిత్రంగా కాలువతో పాటు, స్నానాల రేవు మెట్లపైకి నాచు పచ్చని రంగుతో ఆకులు.. నీరు కనిపించని విధంగా విస్తరించింది. దీనిని నాచుఆకుగా రైతులు గుర్తించారు. నాచు ఆకు వేగంగా విస్తరిస్తుందని, పంట కాలువ ద్వారా పొలంలోనికి వస్తే వారం రోజుల్లో పొలం అంతా విస్తరించి తీవ్ర నష్టం కలిగిస్తుందని రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు దీనిని వేగంగా తొలగించే కార్యక్రమం చేపట్టకపోతే, పొలాల్లోకి చేరే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. గడ్డి మందు కొడితే నాచుఆకు చనిపోతుందని, ఈ నీటిని పశువులు తాగే అవకాశం ఉన్న కారణంగా దాళ్వా సాగయ్యే వరకూ మందు కొట్టడానికి వీల్లేదని రైతులు చెబుతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను వివరణ కోరగా, అజొల్లా అయిఉంటుందని, అజొల్లా అయితే పొలానికి సారం పెరగడంతో పాటు, పశువులకు దాణాగా ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల నుంచి వస్తున్న అనుమానాల ప్రకారం దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: మహిళా సంఘాల బలోపేతంతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా టీటీడీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా మహిళా సమాఖ్య కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 558 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీగా రూ.వంద కోట్ల చెక్కును జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమానికి సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జె.ధనలక్ష్మి అధ్యక్షత వహించగా, ప్రతినిధులు బి.చంటమ్మ, ఎం.నాంచారమ్మ, కె.రత్నం పాల్గొన్నారు. వస్త్ర సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు డి.భవాని, ప్రతినిధులు అంబటి లక్ష్మి, పి.ఎస్తేరురాణి, పి.లోవ, దుర్గావేణి హాజరయ్యారు. ఉత్తమ మండల సమాఖ్య ప్రతినిధులను సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలి



మహిళా నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోను రాణించి, పురుషులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోను ముందుండాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభల్లో మహిళలకు 50 శాతం అవకాశాలు కల్పించారన్నారు. వారి అభ్యున్నతి కోసం మహిళా మార్టులు, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించి, ప్రతి మహిళా స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేశారన్నారు. ప్రతి మహిళ తనకు నచ్చిన రంగంలో ప్రతిభను చూపించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలతో కలిసి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. మహిళా నాయకురాలిగా వారికి ఎప్పుడూ, ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని ఆమె భరోసా ఇచ్చారు. సమాజంలో మహిళల అభ్యున్నతి, మహిళా రిజర్వేషన్, మహిళల భద్రత తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపల్ చైర్‌పర్సన్లు గండేపల్లి సూర్యావతి, గంద్రేటి మంగతాయారు, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, నియోజకవర్గ మహిళా కౌన్సిలర్లు సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాలను నిషేధించాలి



శ్రామిక మహిళలను సత్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: శ్రామిక మహిళలను కన్నీటికి చేరువ చేస్తున్న మద్యాన్ని, మాదకద్రవ్యాలను నిషేధించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు ఎన్.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళల దినోత్సవం సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కత్తులగూడెంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి శ్రామిక మహిళలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం శ్రామిక మహిళలను డాక్టర్ లక్ష్మి చేతులమీదుగా సన్మానించారు. అనంతరం కమిటీ నాయకులు ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ, శ్రామిక మహిళల జీవితాలలో వెలుగులు నిండాలంటే కేవలం మద్యం, మాదకద్రవ్యాల నిషేధం మాత్రమే మార్గమన్నారు. మహిళా సాధికారత అంటే మహిళలను సత్కరించడం లేక మహిళల చేతికి డబ్బులివ్వడమో కాదన్నారు. మహిళలు స్వేచ్ఛగా, ఆనందంగా జీవించడమని అన్నారు. మహిళలు ఆనంద జీవితాన్ని గడపాలంటే ప్రభుత్వాలు మద్యం మహమ్మారిని ఆదాయవనరుగా చూడరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కరణం విశ్వనాథం, గీసాల తారకరామ్, పాస్టర్ ఎలీషా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌తో రాజ్యాంగంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకంతో ప్రతి విద్యార్థికి రాజ్యాంగంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవచ్చని పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక విద్యాలయలో శుక్రవారం పీఎంశ్రీ పథకంలో భాగంగా బాల సంపద్ మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ తరగతి చదవుతున్న 68 మంది విద్యార్థులు భారత పార్లమెంట్ ఏ విధంగా జరుగుతోందో.. అలాగే విధంగా పూర్తి స్థాయిలో స్పీకర్ నుంచి ఎంపీల వరకు ప్రత్యేక దుస్తులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ, పార్లమెంట్ సభల్లో రూపొందించే చట్టాలు, కనీస పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు బాల సంపద్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సనపల సత్యనారాయణ, జగన్మోహన్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు నవోదయం 2.0 ప్రారంభం

కాకినాడ సిటీ: నాటు సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సారా తయారీ, విక్రయాలను మానుకోవాలని, ఇక కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నవోదయం 2.0 ద్వారా అర్హులైన వారికి ఉపాధి చర్యలు చేపడతారన్నారు. సారాపై 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. జిల్లాలో గుర్తించిన 137 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ సారా తయారు చేసే కుటుంబాలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నల్లబెల్లం వ్యాపారులను నియంత్రించాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, జెడ్పీ సీఈవో, డీపీఓ, జిల్లా అటవీ అధికారి, డీపీఆర్‌ఓతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ రమాదేవి

పిఠాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పిఠాపురం సబ్ రిజిస్ట్రార్ వి.రమాదేవి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఆకాశంలో సగం–అవకాశాల్లో సగం అన్నది కేవలం నినాదంగా మిగిలిపోకూడదని, ఆచరణలో జరగాలంటే ముందుచూపు, ప్రణాళిక ఉండాలని తెలిపారు. ముఖ్యఅతిథి రమాదేవి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన, స్వయం నిర్ణయాధికారం తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఉమెన్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు డా. కె.ఉషశ్రీ మాట్లాడుతూ, విద్యార్థినులు చదువు మాత్రమే కాకుండా, స్వీయరక్షణకు కరాటే వంటి విద్యలను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హ్యాండీ క్రాఫ్ట్, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, షటిల్, టెన్నికాయిట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పైపులైన్ గొయ్యి



కొత్తపల్లి-పండూరు రోడ్డులో తవ్వి వదిలేసిన పైపులైన్ గొయ్యి

కొత్తపల్లి: పండూరు–కొత్తపల్లి రోడ్డు ప్రమాదకరంగా మారింది. నాగులాపల్లి ఏరియా రక్షిత మంచి నీటి పథకానికి సంబంధించి ప్రధాన పైపులైన్ వేసేందుకు కొమరగిరి రోడ్డులో గోతులను తవ్వారు. పైపులైన్ పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా గొయ్యిని మాత్రం పూడ్చలేదు. దీంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. పైపులైన్ గోతిలో ఓ అధికారి మోటారు సైకిల్‌తో పడి ప్రమాదానికి గురయ్యారు. ఇంకా పలు ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా కాకినాడ నుంచి ఉప్పాడ వస్తున్న ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పినట్లు సమాచారం. అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. అభివృద్ధి పనులలో భాగంగా ప్రధాన పైపులైన్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణను వివరణ కోరగా, కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడం వలన తవ్విన గోతిని పూడ్చలేదన్నారు. త్వరలో గోతిని పూడ్చే చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- టీటీడీసీలో ఘనంగా మహిళా దినోత్సవం



లెమన్ ఇన్ స్పూన్‌లో పోటీ పడుతూ..

సామర్లకోట: మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక టీటీడీసీలో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లెమన్ ఇన్ స్పూన్, రింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, తాడు లాగే ఆటలను నిర్వహించారు. ఆయా ఆటలో 20 నుంచి 60 మంది వరకు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీడీ కె.శ్రీరమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ భావన ముఖ్యఅతిథిగా పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. లెమన్ ఇన్ స్పూన్‌లో డి.నూకరత్నం, పంతాడి నూకరత్నం, రేవు విజయ కుమారి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. అలాగే మ్యూజికల్ చైర్స్‌లో బి.దేవి, మంగాదేవి, కె.స్వప్న, ముగ్గుల పోటీల్లో జి.వీరలక్ష్మి, పి.ఉష, జీవీవీ లక్ష్మి, బిందెల పోటీల్లో పి.వీరలక్ష్మి, ఎ.లక్ష్మి, సీహెచ్ దేవి బహుమతులు పొందారు. రింగ్‌లో పి.గనికమ్మ టీం విన్నర్స్‌గా, పి.నళినీ టీం రన్నర్స్‌గా నిలిచారు. తాడు ఆటలో ఎ.పుష్పలత టీం విన్నర్స్‌గా నిలిచినట్లు వెలుగు డీపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీపీఎంలు, ఏపీఎంలు వ్యవహరించారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, వెలుగు సిబ్బంది పోటీల్లో పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలో సందడి



తాడు లాగుతూ..

ఘనంగా అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



అపర్ణా సమేత నాగేశ్వరస్వామి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణా సమేత నాగేశ్వర స్వామివారి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వేద పండితులు ఆకొండి వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి శుక్రవారం సుబ్రహ్మణ్య అభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం సిద్ధి వినాయకస్వామికి పంచామృతాభిషేకాలు, నాగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అపర్ణాదేవి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిగాయి. భక్తులు కల్యాణోత్సవాలను తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నాటక పోటీలు ప్రారంభం

కల్యాణోత్సవాల సందర్భంగా అపర్ణా నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సాయికార్తీక్ క్రియేషన్స్ కాకినాడ వారి ఎడారిలో వాన చినుకు అనే నాటకాన్ని ప్రదర్శించారు.

రామాలయ జీర్ణోద్ధరణకు పూజలు

కాకినాడ రూరల్: సర్పవరంలో సుమారు 160 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయం జీర్ణోద్ధరణకు రెండో రోజు శుక్రవారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పురాణం రామకృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో శనివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా హనుమ లక్ష్మణ సహిత సీతా రామచంద్రస్వామి వార్ల విగ్రహాలకు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రాతఃఆరాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, గోపూజ, వేదాది విన్నపాలు, సుందరకాండ, పారాయణ, దివ్య ప్రబంధ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, ఛాయాస్నపనం, సర్వశత్రు బాధా నివారణకు సుదర్శన ఇష్టి, నివేదన, పూర్ణాహుతి, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, తదీయారాధన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.